క్లుప్తంగా

మరియ మాత గృహ నిర్మాణానికి భూమిపూజ



ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

మిడుతూరు: మండల పరిధిలోని 49–బన్నూరు గ్రామంలో ఆర్‌సీఎం సంఘస్తులకు కేటాయించిన సమాధుల స్థలంలో మరియ మాత గృహ నిర్మాణానికి విచారణ గురువు మధు బాబు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ చేతుల మీదుగా బుధవారం భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మా ఇంటి దైవం మరియా తల్లిని కష్ట, సుఖాలలో స్మరించుకుంటానని చెప్పారు. ప్రతి ఒక్కరూ భక్తి భావాలతో మెలగాలన్నారు. గుడి నిర్మాణానికి తమ వంతు సహకారం అందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సల్కోటి గోవర్ధన్‌రెడ్డి, కమతం వీరారెడ్డి, తిమ్మాపురం నాగన్న పాల్గొన్నారు.

క్రమశిక్షణతో మెలిగితే ఉన్నత స్థాయి

నందికొట్కూరు: విద్యార్థులు క్రమశిక్షతో మెలిగితే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుతారని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(కోట) హెచ్ఎం సలీంబాషా అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం 10వ తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులు సరస్వతీ పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ కలిగి ఉంటేనే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకుంటారన్నారు. చిన్న వయస్సులోనే చెడు వ్యసనాలకు లోనుకాకూడదని చెప్పారు. సెల్ ఫోన్‌లు పక్కన్న పెట్టి చదువుపై దృషి సారించాలని తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ ఫిజికల్ డైరెక్టర్, శాప్ కర్నూలు జిల్లా కో ఆర్డినేటర్ శ్రీనాథ్, ఉపాధ్యాయులు, ఓం శాంతి సంస్థ ప్రతినిధి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 32 మంది ఎంపిక



ఎంపికైన విద్యార్థులకు నియామకపత్రాలు అందిస్తున్న ప్రిన్సిపాల్ బుచ్చయ్య

శ్రీశైలంప్రాజెక్ట్: నంద్యాల ఎస్‌ఆర్‌సీ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో గత శనివారం జరిగిన జాబ్‌మేళాలో సున్నిపెంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు 32 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.ఎం.బుచ్చయ్య తెలిపారు. టాటా, అమెజాన్, వెర్రోటెక్నాలజీ, భారత్ బయో టెక్నాలజీ తదితర ప్రైవేటు సంస్థలలో ఉద్యోగ అవకాశాలు లభించినట్లు వెల్లడించారు. ఉద్యోగ అవకాశాలు పొందిన విద్యార్థులకు బుధవారం కళాశాల ప్రాంగణంలో నియామక పత్రాలు అందజేశారు.

బీటీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని కోనేటమ్మపల్లి గ్రామంలో నూతన బీటీ రోడ్డు నిర్మాణానికి ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి బుధవారం భూమిపూజ చేశారు.ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి ఒక్క వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమవుతుందని ఆయన అన్నారు. శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి సహకారంతో మండలంలోని గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ గంగాధరప్ప, నాయకులు వేణురెడ్డి, సురేష్, నాగరాజు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో పేదలకు మేలు


నందికొట్కూరు రూరల్: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని వైద్యులు క్రిష్ణమూర్తి అన్నారు. బుధవారం మండల పరిధిలోని మల్యాల గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో 508 మంది ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. గతంలో సిఫార్సు చేసిన వారికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు రాజశేఖర్, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తుల కోసం 'కరదీపిక'

శ్రీశైలంటెంపుల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని దేవస్థానం భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలపై కరదీపిక పేరుతో సమాచారం బుక్‌ను విడుదల చేసింది. ఈఓ డి.పెద్దిరాజు ప్రత్యేకంగా దీనిని రూపొందించారు. బ్రహ్మోత్సవాల్లో భక్తులకు దేవస్థానం కల్పిస్తున్న సౌకర్యాల గురించి పూర్తి సమాచారం కరదీపికలో పొందుపర్చారు. అలాగే బ్రహ్మోత్సవాల్లో స్వామిఅమ్మవార్లకు జరిగే సేవలు, పూజావేళలు, పార్కింగ్ ప్రదేశాలు, తాత్కాలిక వసతి, భక్తుల సౌకర్యాలు, దేవస్థాన అధికారుల ఫోన్ నంబర్లు, క్షేత్ర పరిధిలోని ప్రైవేట్ సత్రాల ఫోన్లు నెంబర్లు పొందుపరిచారు.

నల్లమల అరణ్యం.. శివుడి నిలయం

- అటవీ ప్రాంతంలో ప్రముఖ శైవక్షేత్రాలు కొలువు
- ప్రకృతి అందాల మధ్య ఆలయాలు
- శివరాత్రి సందర్భంగా మారుమోగుతున్న ఓంకార నాదం



సంగమేశ్వరక్షేత్రం

కృష్ణానది చెంత సప్తనదుల కలయికతో సంగమేశ్వరక్షేత్రం వెలసింది. ఈ క్షేత్రం త్రేతాయుగంలో నిర్మించినట్లు ఆధారాలు ఉన్నాయి. త్రేతాయుగంలో పాండవులు అరణ్యవాసం చేసే సమయంలో ఈ ప్రాంతంలో సంచరించారని, కృష్ణానదికి పూజలు చేసే సమయంలో భీముడు కాశీ క్షేత్రానికి శివలింగాన్ని తీసుకువచ్చేందుకు వెళ్లినట్లు తెలుస్తుంది. పాండవులు పూజలు చేసుకునే సమయం ముగింపు దశకు రావడం.. భీముడు శివలింగాన్ని తీసుకురాకపోవడంతో అక్కడ ఉన్న ఓ వేపచెట్టును నరికి లింగాకృతిగా ఏర్పాటు చేసి పాండవులు పూజించినట్లు ప్రతీతి. ఇక్కడ వెలసిన సంగమేశ్వరుడు వేపదారు లింగరూపంలో వెలిశాడు. ఈ ఆలయం 8 నెలలు కృష్ణానది గర్భంలో జలదిగ్బంధమై కేవలం 4 నెలలు మాత్రమే భక్తులకు దర్శనమిస్తుంది. కృష్ణానది బోటు షికారుతో పాటూ సోమశిలా, దంతాలలింగమయ్య, స్వామివార్లను దర్శించుకోవచ్చు. సప్తనదుల సంగమేశ్వరుడిని దర్శిస్తే సమస్త పాపాలుతొలగి, కోటి జన్మల పుణ్యఫలితం లభిస్తుందని భక్తుల నమ్మకం.

ఇలా చేరుకోవాలి..

ఆత్మకూరు మీదుగా 45 కిమీ దూరంలో ఈ క్షేత్రం ఉంది. అన్ని వాహనాల ద్వారా ఈ క్షేత్రానికి చేరుకోవచ్చు.

ఆత్మకూరు: నల్లమల అటవీప్రాంతం శైవ క్షేత్రాలకు నెలవు. ఎత్తైన కొండలు, గుట్టలల్లో, పచ్చని వృక్షసంపద మధ్య వెలసిన శైవక్షేత్రాలు మహాశివరాత్రి పర్వదినం ప్రత్యేక పూజలకు ముస్తాబవుతున్నాయి. భక్తుల ఓంకార నాదంతో ప్రతిధ్వనిస్తున్నాయి. ఓం నమఃశివాయ పంచాక్షరీ నామం జపిస్తూ భక్తులు శైవక్షేత్రాలకు తరలివెళ్తున్నారు. మహాశివరాత్రి సందర్భంగా ఆత్మకూరు డివిజన్ పరిధిలోని శైవక్షేత్రాలపై కథనం.

ఇల కైలాసం శ్రీశైలం

భూమండలానికే నాభిస్థానంగా.. రెండో కైలాసం, ఇల కైలాసంగా శ్రీశైలమహాక్షేత్రం వర్ధిల్లుతోంది. శ్రీశైలమహాక్షేత్రానికి మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా లక్షలాది మంది భక్తులు పాదయాత్రగా, వాహనాల్లో తరలివచ్చి శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్లను దర్శించుకుంటున్నారు. శ్రీశైలక్షేత్రంతో పాటు పాతాళగంగ, హటకేశ్వరం, శిఖరేశ్వరం, పాలధార, పంచధార, మల్లమ్మ కన్నీరు, సాక్షిగణపతి తో పాటూ పలు సుందరమైన ఉద్యానవనాలు ఈ క్షేత్రంలో చూటదగ్గ ప్రదేశాలు.

అలయ విశిష్టత..

శ్రీశైలమహాక్షేత్రానికి యుగయుగాల చరిత్ర ఉంది. ఇక్కడ వెలసిన మల్లికార్జున స్వామి సాక్ష్యాత్ మహాశివుని ప్రతిరూపంగా యోగులు, సప్తరుషులు, దేవతలతో పాటు భక్తులను ఆదిదేవునిగా పూజిస్తున్నట్లు ఎన్నో పురణాలు, ఇతిహాలు, శిలాశాసనాల్లో కూడా లిఖించబడ్డాయి. ద్వాదశ జ్యోతిర్లింగం, అష్టాదశశక్తిపీఠం కలిసి వెలసిన క్షేత్రం ఇది ఒక్కటే. ఈ క్షేత్ర సమీపంలో ఉన్న శిఖరేశ్వరం వద్ద నంది కొమ్ముల నుంచి శ్రీశైలశిఖరాన్ని దర్శిస్తే పునఃర్జన్మ ఉండదని భక్తుల నమ్మకం. మల్లికార్జునస్వామిని దర్శిస్తే ఎన్నో జన్మల పుణ్యఫలం లభిస్తుందని భక్తుల నమ్మకం.

ఇలా చేరుకోవాలి

శ్రీశైలక్షేత్రానికి ఆత్మకూరు నుంచి 110 కిమీ దూరంలో దోర్నాల మీదుగా శ్రీశైలానికి చేరుకునేందుకు రోడ్డు మార్గం ఉంది. అలాగే ఆత్మకూరు నుంచి వెంకటాపురం మీదుగా ఈ క్షేత్రానికి చేరుకోవడానికి 40 కిమీ కాలినడకన వెళ్లవచ్చు. ఉమ్మడి జిల్లాలతో పాటు పలు ఇతర రాష్ట్రాల నుంచి కూడా శ్రీశైల క్షేత్రానికి రవాణా సౌకర్యం ఉంది.

గుండ్లబ్రహ్మేశ్వరం

నల్లమల అటవీఅందాల మధ్య గుండ్లకమ్మ నది చెందన గుండ్లబ్రహ్మేశ్వర క్షేత్రం వెలసింది. క్షేత్రంలో గుండ్లబ్రహ్మేశ్వరస్వామి, పార్వతీదేవి వెలిశారు. అతిపురాతనమైన గుండ్లబ్రహ్మేశ్వరం క్షేత్రంలో మహాశివరాత్రి పర్వదినాన మాత్రమే భక్తుల సంచారం ఉంటుంది. మిగిలిన రోజుల్లో ఇక్కడికి భక్తులు వెళ్లే అవకాశం లేదు. ఇక్కడ వెలసిన గుండ్లబ్రహ్మేశ్వరుడిని దర్శిస్తూ మోక్షం ప్రాప్తిస్తుందని భక్తుల విశ్వాసం...నల్లమల అందాలతో ఆంగ్లేయులు వేసిన టేకు వృక్షాలు, వివిధ రకాల వృక్ష సంపదతో పాటూ అటవీ జంతువులను సైతం చూసే అవకాశం ఉంది.

ఇలా చేరుకోవాలి..

ఈ క్షేత్రం బండిఆత్మకూరు మండలం, సంతజూటూరు సమీపంలో నల్లమలలో కొలువై ఉంది. బండిఆత్మకూరు, సంతజూటూరు నుంచి 18 కిమీ దూరంలో వివిధ వాహనాల ద్వారా చేరుకోవచ్చు.

సరస్వతీ నిలయం.. కొలనుభారతిక్షేత్రం

భారతదేశంలో వెలసిన సరస్వతీ దేవాలయాల్లో రెండవ క్షేత్రంగా కొలను భారతి క్షేత్రం వెలసింది. కొలనుభారతి క్షేత్రంలో సరస్వతీ దేవి వెలిసింది. జనమేజయ మహారాజు ఇక్కడ తపస్సు ఆచరించి సరస్వతి దేవి అనుగ్రహం పొందాడని ప్రతీతి. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా పెద్ద ఎత్తున కొలను భారతిలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరగడంతో పాటు చారుఘోషినిగా పిలవబడే నది అంతర్వాహిణిలో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారికి పూజలు నిర్వహిస్తారు. ఈ క్షేత్రంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేస్తే విజ్ఞానం పెరుగుతుందని, జ్ఞాన సరస్వతి అమ్మవారిని దర్శిస్తే సకల శుభాలు కలుగుతాయని భక్తుల నమ్మకం.

ఇలా చేరుకోవాలి:

ఈ క్షేత్రం కర్నూలు నుంచి 80 కిమీ, ఆత్మకూరు నుంచి 25 కిమీ దూరం అన్ని వాహనాల ద్వారా ఈ క్షేత్రానికి చేరుకోవచ్చు.

ఓంకారక్షేత్రం

ఓంకారక్షేత్రం అతిప్రాచీన క్షేత్రం. ఈ మహాక్షేత్రంలో ఓంకారేశ్వరునిగా మహాశివుడువెలిశాడు. ఓం అనే ప్రణవనాదం ఈ క్షేత్రం నుంచే విశ్వవ్యాప్తంగా వ్యాప్తి చెందినట్లు ప్రతీతి. ఇక్కడ స్నానం ఆచరించి ఓంకారేశ్వరస్వామిని దర్శిస్తే కోటి పుణ్యఫలాలు లభిస్తాయని భక్తుల విశ్వాసం. బ్రహ్మలోకం, విష్ణులోకం, కైలాసం పుణ్యక్షేత్రాలు, ఓంకార క్షేత్రం ఎదురుగా ఉన్న నల్లమల కొండపై వెలిశాయి. ఈ క్షేత్రంలో కాశిరెడ్డినాయన నిత్యాన్నదాన కార్యక్రమం ఉంటుంది.

ఇలా చేరుకోవాలి

ఆత్మకూరు నుంచి ఓంకారానికి 35 కిమీ, నంద్యాల నుంచి 20 కిమీ దూరంలో ఈ క్షేత్రం ఉంది.

నాగలూటి వీరభద్రస్వామి క్షేత్రం

నల్లమల అటవీపరిధిలో నాగలూటి క్షేత్రం ఉంది. శ్రీశైలాలయంలో వెలసిన శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్లకు ద్వారపాలకుడిగా, శ్రీశైలం వెళ్లే కాలినడక భక్తులకు రక్షకుడిగా వీరభద్రస్వామి వెలసినట్లు పలు పురాణాల్లో తెలిపారు. వీరభద్రస్వామిని దర్శిస్తే శ్రీశైలమల్లన్నను దర్శించినంత పుణ్యఫలం లభిస్తుందని భక్తుల నమ్మకం.

ఇలా చేరుకోవాలి..

ఈ క్షేత్రానికి కేవలం కాలినడక ఒక్కటే మార్గం, వెంకటాపురం, బైర్లూటి నుంచి కాలినడక ద్వారానే ఈ క్షేత్రానికి వెళ్లాలి. రోడ్డు మార్గం లేదు.

రుద్రకోడు మహాక్షేత్రం..

రుద్రకోడు మహాక్షేత్రం అత్యంత పురాతనమైనది. ఈ క్షేత్రంలో రుద్రాణి సమేత శ్రీరుద్రకోటేశ్వరస్వామి కొలువై ఉన్నాడు. మహాశివుడు కైలాసంలో ఉగ్రరూపుడై భూలోకంలోని ఈ క్షేత్రానికి చేరుకున్నాడని, ముక్కోటి దేవతలు రుద్రుడైన మహాశివుడిని శాంతింపజేశారని పురాణాలు చెబుతున్నాయి. ఇక్కడ వెలసిన మహాశివుడు రౌద్ర రూపంలో ఉండడం వలన రుద్రకోటేశ్వరుడుగా పేరున్నట్లు తెలుస్తుంది. ఈ క్షేత్రానికి సంబంధించి స్కందపురాణంలో రుద్రకోటేశ్వర చరిత్ర ఉన్నట్లు తెలుస్తుంది. ఇక్కడ ఉన్న రెండు కోనేరుల్లో స్నానమాచరించి భక్తులు రుద్రకోటేశ్వరస్వామిని దర్శించుకుంటున్నారు. స్వామిని దర్శించడం వలన కోటి జన్మల పుణ్యఫలం లభిస్తుంది.

ఇలా చేరుకోవాలి:

ఆత్మకూరు నుంచి 23 కిమీ దూరం, నంద్యాల నుంచి 40 కిమీ దూరం, కర్నూలు నుంచి 80 కిమీ దూరం ఉంది. ఈ క్షేత్రంలో నల్లమలలో మట్టి రహదారే శరణ్యం, అన్ని రకాల వాహనాల ద్వారా ఈ క్షేత్రానికి చేరుకోవచ్చు.

మహానందీశ్వరుడి దర్శనం సర్వపాపహరణం

మహానందిపుణ్యక్షేత్రం శైవక్షేత్రాలలో విశిష్టత ఉంది. గంగప్రవాహంతో సెలయేరు మధ్యలో శ్రీమహాశివుడు కొలువుదీరి ఉన్నాడు. మహానందీశ్వరస్వామిగా కొలిచే ఇక్కడ స్వామి శిలాకృతి అన్ని శివలింగాలకంటే భిన్నంగా ఉంటుంది. గలగల పారే జలసవ్వడులు భక్తులను ఆశ్చర్య పరుస్తాయి. ఈ క్షేత్రం చుట్టూ 3 కోనేరులు ఉంటాయి. మహానందిలో 9 నందులు వెలిశాయి. ఇందులో మహానంది సమీపాన వినాయకనంది, గరుడ నంది, సూర్యనంది క్షేత్రాలు చూడవచ్చు. మహానందీశ్వరస్వామిని దర్శిస్తే సర్వపాపాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం.

ఇలా చేరుకోవాలి

ఈ క్షేత్రం కర్నూలు నుంచి నంద్యాలకు 70 కిమీ, ఆత్మకూరు నుంచి 60 కిమీ దూరం ఉంది. అన్ని రకాల వాహనాల ద్వారా క్షేత్రాన్ని చేరుకోవచ్చు.

మహానందీశ్వరుడికి కాణిపాకం పట్టువస్త్రాలు



మహానంది ఈఓకు పట్టువస్త్రాలు అందిస్తున్న కాణిపాకం ఈఓ, చైర్మన్

మహానంది: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామివార్లకు కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం నుంచి పట్టు వస్త్రాలను సమర్పించారు. బుధవారం కాణిపాకం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు ఆధ్వర్యంలో పండితులు పట్టు వస్త్రాలు తీసుకొచ్చారు. మహానంది ఈఓ చంద్రశేఖర్ రెడ్డి, మాజీ చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, వేదపండితులు రవిశంకర అవధాని, అర్చకులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టువస్త్రాలు అందజేశారు.

ఆరోగ్యశ్రీతో రూ.25లక్షల వరకు ఉచిత వైద్యం



పారుమంచాలలో ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ, ఎంపీడీఓ, డాక్టర్ మౌనిక

పాములపాడు: ఆరోగ్య శ్రీ ద్వారా ఇక నుంచి రూ.25లక్షల వరకు ఉచితంగా వైద్యం అందించబడునని ఎంపీడీఓ సరస్వతి తెలిపారు. బుధవారం మండలంలోని ఇస్కాల, మద్దూరు, పాములపాడు గ్రామాల్లో పర్యటించారు. నూతనంగా మంజూరైన ఆరోగ్య శ్రీ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కాలనీల్లో ఏమైనా సమస్యలున్నాయా, సచివాలయ సిబ్బంది సక్రమంగా సేవలందిస్తున్నారా అని ఆరా తీశారు.


ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ 70 శాతం పూర్తి

పగిద్యాల: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ 70 శాతం పూర్తయ్యిందని ఎంపీడీఓ కవిరాజు బుధవారం తెలిపారు. మండలంలోని పది సచివాలయాలకు 6 వేల కార్డులు మంజూరయ్యాయన్నారు. మిగిలిన 30 శాతం కార్డుల పంపిణీని త్వరితగతిన పూర్తి చేయాలని వలంటీర్లకు ఆదేశించినట్లు ఎంపీడీఓ వెల్లడించారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ

జూపాడుబంగ్లా: మండలంలోని పారుమంచాల గ్రామంలో జెడ్పీటీసీ పోచా జగదీశ్వరరెడ్డి, ఎంపీడీఓ నూర్జహాన్, డాక్టర్ మౌనిక ఆరోగ్య శ్రీకార్డులను బుధవారం పంపిణీ చేశారు. మండలంలోని 12గ్రామపంచాయతీలకు 7,521 ఆరోగ్యశ్రీ కార్డులు మంజూరైనట్లు ఎంపీడీఓ తెలిపారు. ఇప్పటిదాకా 5,387కార్డులు పంపిణీ చేసి జిల్లాలో ఐదోస్థానంలో నిలిచినట్లు వెల్లడించారు.


జంబులమ్మ గుడికి రూ.లక్ష విరాళం



దాతలకు రశీదులు ఇస్తున్న కమిటీ సభ్యులు

పాములపాడు: మండలంలోని జూటూరు గ్రామంలో నూతనంగా జంబులమ్మ గుడి నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామలింగేశ్వరరెడ్డి రూ.1,00,000 విరాళం అందజేశారు. బుధవారం నిర్మాణంలో ఉన్న గుడిని పాములపాడు మాజీ సర్పంచు విజయసింహారెడ్డితో కలిసి దర్శించారు. నిర్మాణం దాదాపుగా పూర్తి కావచ్చిందని, ఇంకా కాంపౌండ్ నిర్మాణం చేపట్టాల్సి ఉందని గ్రామస్తులు తెలిపారు. దీంతో తన వంతుగా రామలిగేశ్వరరెడ్డి రూ.లక్ష ఇవ్వగా, విజయసింభారెడ్డి రూ.10,000 ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేశ్వరరెడ్డి, మధుసూదన్‌రావు, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు మద్దిలేటి, రామలింగారెడ్డి, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లోనే వైద్యసేవలు



కంటి అద్దాలను పంపిణీ చేస్తున్న వైద్యుడు

కొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో గ్రామాల వద్దకే వైద్య సేవలు తీసుకువచ్చిందని డాక్టర్ మహమ్మద్ బేగ్ అన్నారు. బుధవారం మండలంలోని గువ్వలకుంట్ల గ్రామ సచివాలయం వద్ద వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో వివిధ వ్యాధిగ్రస్తులు షుగర్, బీపీ, జ్వరం, ఒంటి నొప్పులు, ఇతర వ్యాధులకు మందులు పంపిణీ చేశారు. అదేవిధంగా జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు ద్వారా కంటి పరీక్షలు చేయించుకున్న 60 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఎస్ఎం సరిత వైద్యసిబ్బంది పాల్గొన్నారు.


ఆస్తి పన్ను చెల్లిస్తే వడ్డీ మాఫీ

ఆత్మకూరు: మున్సిపాలిటీ పరిధిలో ఆస్తి పన్ను బకాయిలు చెల్లిస్తే వడ్డీ రాయితీ ఇవ్వడం జరుగుతుందని ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ హరిప్రసాద్ తెలిపారు. ఈ నెల చివరినాటికి చెల్లింకపోతే బకాయి పన్నుతో పాటు వడ్డీ చెల్లించాల్సి వస్తుందని చెప్పారు.

శివభక్తులకు ఉచితంగా మందులు

వెలుగోడు: మహా శివరాత్రిని పురస్కరించుకొని రుద్రకోటేశ్వర క్షేత్రానికి వెళ్తున్న శివ భక్తులకు ఉచితంగా మందులు అందజేస్తున్నట్లు బాలాజీ మెడికల్ షాపు అధినేత ముక్కామల్ల జయరాం రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణానికి చెందిన రుద్రాణి సమేత రుద్ర కోటేశ్వర స్వామి వాసవీ ఆర్యవైశ్యసత్రానికి మందులను అందజేశారు. కార్యక్రమంలో మాలేపాటి రమణయ్య, తాళ్లూరి మురళీకృష్ణ, బొగ్గరపు లక్ష్మీ నారాయణ, జూటూరు నాగపుల్లయ్య, శ్రీరాం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న జడ్జి వెంకటేశ్వరరావు

ఆత్మకూరు: మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సినియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు అన్నారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఐసీడీఎస్, వైద్యశాఖ ఆధ్వర్యంలో మహిళలకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళలు ప్రధానంగా విద్యలో రాణించాలన్నారు. బేటీ బచావో–బేటి పడావో అనే నినాదాన్ని మహిళలు తెలుసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియా మారూఫ్, ఐసీడీఎస్ సీడీపీఓ నిర్మల, డాక్టర్ మస్తాన్‌వలి, న్యాయవాదులు పాల్గొన్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు

మహానంది: బండిఆత్మకూరు మండలం శింగవరంలో శ్రీ వెంకటేశ్వర, ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు బుధవారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన వృషభాల బండలాగుడు పోటీలు హోరాహోరీగా జరిగాయి. వెలుగోడు మద్దెల నాగేశ్వరరెడ్డి వృషభాలు మొదటి స్థానం, శింగవరం జబివుల్లా వృషభాలు రెండో స్థానం, పార్నపల్లె వెంకటేశ్వర్లు వృషభాలు మూడో స్థానం, వెలుగోడు ఆంజనేయులు వృషభాలు నాలుగోస్థానం సాధించాయి. వీరికి వరుసగా రూ.15వేలు, రూ. 10వేలు, రూ. 5వేలు, రూ. 3వేలు నగదు బహుమతులు అందించారు.

9న రాష్ట్రస్థాయి ఎడ్ల బలప్రదర్శన

మహానంది: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మూడు రోజుల పాటు మహానందిలో అఖిల భారత ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, దేవస్థానం మాజీ చైర్మన్ కొమ్మా మహేశ్వర్ రెడ్డి తెలిపారు. మహానందిలోని పాపిరెడ్డి కాటేజ్ వద్ద బుధవారం సాయంత్రం ఎడ్ల బల ప్రదర్శన పోటీల బహుమతుల కరపత్రాలను విడుదల చేశారు. సీనియర్స్ విభాగంలో మొత్తం ఐదు బహుమతులు ఉంటాయన్నారు. రూ. 1.25లక్షలు, రూ. 80వేలు, రూ. 60వేలు, రూ. 40వేలు, రూ. 30వేలు చొప్పున బహుమతులు అందజేస్తామన్నారు. మొదటి బహుమతిని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, రెండో బహుమతిని నంద్యాల ఎమ్మెల్యే రవిచంద్రకిషోర్‌రెడ్డి ఇస్తున్నట్లు చెప్పారు.

టాయిలెట్ కాంప్లెక్స్ ప్రారంభం



టాయిలెట్ కాంప్లెక్స్‌ను ప్రారంభించిన ఈఓ, కంపెనీ ప్రతినిధులు

మహానంది: మహానందీశ్వర స్వామి దర్శనార్థం వచ్చే భక్తుల కోసం జేఎస్‌డబ్ల్యూ ఆధ్వర్యంలో రూ.40లక్షల సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన టాయిలెట్ కాంప్లెక్స్‌ను బుధవారం ప్రారంభించారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, జేఎస్‌డబ్ల్యూ ప్రతినిధి నవనీత్ చౌహాన్ ఆధ్వర్యంలో ముందుగా పూజలు నిర్వహించి ప్రారంభించారు. భక్తుల సౌకర్యార్థం సహకరించిన కంపెనీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ రాష్ట్ర డైరెక్టర్ నాగభూపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, మాజీ ధర్మకర్త గంగిశెట్టి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గోపూజ

మహానంది: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మహానంది పుణ్యక్షేత్రంలో బుధవారం మధ్యాహ్నం గోపూజ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఆలయ ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు రవిశంకర్ అవధాని, అర్చకులు గోమాతను పట్టు వస్త్రాలతో అలంకరించారు. గణపతి పూజ, దీక్ష ధారణ పూజలను శాస్త్రోక్తంగా చేపట్టారు.

దేవస్థానానికి లక్ష మజ్జిగ ప్యాకెట్ల విరాళం



సిబ్బందికి మజ్జిగ ప్యాకెట్లను అందజేస్తున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా అనంతపురానికి చెందిన గాయత్రీ మిల్క్ డెయిరీ ప్రైవేట్ లిమిటెడ్ వారు దేవస్థానానికి లక్ష మజ్జిగ ప్యాకెట్లను విరాళంగా ఇచ్చారు. బుధవారం దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజుకు మజ్జిగ ప్యాకెట్లను అందజేశారు. బ్రహ్మోత్సవాలలో భక్తులకు అందజేసేందుకు వీటిని అందజేశామని, వీటి విలువ రూ.5లక్షలు ఉంటుందని దాతలు తెలిపారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు

- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- క్షేత్ర పరిధిలో ఏర్పాట్ల పరిశీలన



రాయలసీమ రేంజ్ డీఐజీ, ఎస్పీ లతో చర్చిస్తున్న ఎమ్మెల్యే శిల్పా



భక్తులకు అన్నం వడ్డిస్తున్న ఎమ్మెల్యే శిల్పా, మురళీధర్‌రెడ్డి

శ్రీశైలంటెంపుల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీశైలానికి తరలివచ్చే ఏ ఒక్క భక్తుడికి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించామని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తెలిపారు. బుధవారం శ్రీశైలం చేరుకున్న ఎమ్మెల్యే శిల్పా క్షేత్ర పరిధిలో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈఓ డి.పెద్దిరాజుతో కలిసి శివస్వాములు ఇరుముడి సమర్పించే శివదీక్షా శిబిరాలు, 30పడకల తాత్కాలిక వైద్యశాల, టాయిలెట్స్, బ్యాటరీ వాహనంలో ఔటర్‌రింగ్‌రోడ్డు మొత్తం తిరిగి పార్కింగ్ ప్రదేశాలను, తెలంగాణ, కర్ణాటక ఆర్టీసీ బస్టాండ్‌లను సందర్శించారు. అనంతరం హఠకేశ్వరం, కైలాసద్వారం వద్దకు చేరుకుని పాదయాత్ర భక్తులతో సంభాషించి ఏర్పాట్లపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఏర్పాట్లు అన్ని బాగున్నాయని భక్తులు ఎమ్మెల్యేకు తెలిపారు. భక్తుల భద్రతపై రాయలసీమ రేంజ్ డీఐజీ విజయరామరావు, నంద్యాల జిల్లా ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డితో చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే శిల్పా మీడి యాతో మాట్లాడుతూ పాదయాత్ర భక్తుల నుంచి అటవీశాఖ అధికారులు రూ.10 వసూలు చేశారని నా దృష్టికి వచ్చిన వెంటనే అటవీశాఖ మంత్రి, ప్రిన్సిపల్ సెక్రెటరీ దృష్టికి తీసుకెళ్లి రద్దు చేయించానని చెప్పారు. తాను అటవీశాఖ ఇబ్బందుల గురించి అసెంబ్లీలో చర్చించడంతో ఆ నుంచి కూడా ఇబ్బందులు తొలగాయన్నారు. ఆయన వెంట నియోజకవర్గ నాయకులు శిల్పా భువనేశ్వరరెడ్డి ఉన్నారు.

అన్నదానం శిబిరం ప్రారంభం

శ్రీశైలంప్రాజెక్ట్: మహాశివరాత్రికి శ్రీశైలానికి కాలినడకన వచ్చే భక్తులకు కైలాసద్వారం వద్ద వైఎస్సార్‌సీపీ పత్తికొండ సీనియర్ నాయకులు పోచిమిరెడ్డి మురళీధర్‌రెడ్డి ఏర్పాటు చేసిన ఉచిత అన్నదాన శిబిరాన్ని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ప్రారంభించారు. 15 సంవత్సరాలుగా పోచిమిరెడ్డి శివరాత్రి భక్తులకు ఉచిత అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

మిడుతూరు: మండల పరిధిలోని చెరుకుచెర్ల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వద్ద 35 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు బుధవారం ఎస్ఐ జగన్‌మోహన్ తెలిపారు. చెరుకుచెర్ల గ్రామానికి చెందిన అరవింద్ అనే వ్యక్తి మిడుతూరు నుంచి మద్యం బాటిళ్లు తీసుకొని వెళ్తుండగా సమాచారం మేరకు చెరుకుచెర్ల బాటవద్ద అతన్ని అదుపులోకి తీసుకుకొని మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

దుకాణాలపై అధికారుల దాడులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంలో పలు దుకాణాలపై పోలీసు, లీగల్ మెట్రాలజీ అధికారులు, సీఐ చంద్రబాబునాయుడు బుధవారం ఆకస్మిక దాడులు చేశారు. వస్తువులు అధిక ధరలకు విక్రయిస్తున్న 19దుకాణాలపై కేసులు నమోదు చేశారు. మొత్తం రూ.77వేలు జరిమానా విధించారు.

రికార్డుల నిర్వహణ పకడ్బందీగా ఉండాలి

పాములపాడు: దుకాణాల్లో రికార్డుల నిర్వహణ పకడ్బందీగా ఉండాలని ఆత్మకూరు ఏడీఏ ఆంజనేయ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో మన గ్రోమోర్, సుమంత్ ట్రేడర్స్ ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా డీబీటీ, స్టాకు నిల్వ తదితర వివరాలకు సంబంధించిన రికార్డులను, ఎరువుల బస్తాలను పరిశీలించారు. ఎరువుల బస్తాలు నిర్ణయించిన ధరలకు మాత్రమే విక్రయించాలని సూచించారు. కొనుగోలు చేసిన ప్రతి రైతుకు రశీదులు తప్పనిసరిగా ఇవ్వాలని చెప్పారు. ఏఓ ఫణీశ్వరరెడ్డి ఉన్నారు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి

పగిద్యాల: అసంఘిటిత భవన నిర్మాణ కార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి అబ్దుల్ మజీద్ కోరారు. బుధవారం స్థానిక బస్టాండులో భవన నిర్మాణ కార్మికులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో చాంద్‌బాష, రహిమాన్, అచ్చన్న, ముర్తుజావలి, మస్తాన్, తదితరులు ఉన్నారు.

శివస్వాముల సేవలో..

ఆత్మకూరు: నల్లమల అటవీ పరిధిలోని పెచ్చేర్వు గూడెంలో అనంతపురానికి చెందిన వెంకట రెడ్డి, నరసింహారెడ్డి, నందన ఎంటర్‌ప్రైజర్ ఆధ్వర్యంలో లక్షలాది మంది శివస్వాములు, భక్తులకు అన్నదాన కార్యక్రమం, వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. బుధవారం పెద్ద ఎత్తున నాగలూటి నుంచి అడవి మార్గంలో పెచ్చేరువు చేరుకున్న భక్తులకు అన్నదానంతో పాటు బీపీ, షుగర్, జ్వరం, నొప్పులు లాంటి వైద్యసేవలను అందించారు. ఉచితంగా మందులు, కూల్‌డ్రింకులు ఇచ్చారు. ప్రస్తుతం మూడవ సంవత్సరం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, కార్యక్రమంలో నిర్వాహకులు మనోజ్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, దేవనరేష్ పాల్గొన్నారు.



అన్నదాన శిబిరంలో భోజనాలు చేస్తున్న భక్తులు

శ్రీశైలానికి పాదయాత్ర

మిడుతూరు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయాలని జలకనూరు గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం శ్రీశైలానికి పాదయాత్ర చేపట్టారు. వారు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ రాష్ట్రంలో 175 స్థానాలకు 175 గెలవాలని మల్లికార్జునుడిని వేడుకునేందుకు శ్రీశైలానికి వెళ్తున్నామన్నారు. పాదయాత్రలో మల్లు రామలింగరెడ్డి, సిరిగిరి పుల్లయ్య, మండల జేఏసీ కన్వీనర్ రవికుమార్, సురేష్‌నాయుడు, గోపాల్ తదితరులు ఉన్నారు.

శ్రీశైలానికి పాదయాత్రగా శివ స్వాములు

కొత్తపల్లి: శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఇరుముడులు సమర్పించేందుకు శ్రీశైలానికి శివస్వాములు పాదయాత్రగా బయలు దేరారు. బుధవారం కొత్తపల్లి, గువ్వలకుంట్ల, ఇతర గ్రామాల నుంచి శివస్వాములు ఓం నమఃశివాయ జపంతో ఇరుముడులు నెత్తిన పెట్టుకొని యాత్ర ప్రారంభించారు. గ్రామ పురోహితులు యాదవేని లక్ష్మీనరసయ్య శర్మ శివ స్వాములకు ఇరుముడి కట్టి కాయ కర్పూరం సమర్పించారు.

మహిళా దినోత్సవాన్ని జయప్రదం చేయండి

నందికొట్కూరు: మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ పార్టీ జిల్లా కార్యదర్శి నరసింహులు పిలుపునిచ్చారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడకల పోస్టర్లను విడుదల చేశారు. సుబ్బమ్మ, రమణమ్మ, లలితమ్మ, మేరమ్మ, ప్రమీలమ్మ తదితరులు పాల్గొన్నారు.